క్లుప్తంగా

పట్టణవాసులకు ఇబ్బందులు రానివ్వొద్దు

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణను ప్రతి రోజు సక్రమంగా చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న,అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం. లక్ష్మీపతి సూచించారు. 6వ వార్డులో సోమవారం వారు పర్యటించారు. వార్డులో జరుగుతున్న మురుగు కాల్వల గ్యాంగ్ వర్క్ పనులను వారు పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వలలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించి మురుగు పారుదల సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. వారి వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నిత్యావసరాలు, వస్త్రాల పంపిణీ



తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ ఈరే మినిస్ట్రీస్ సంస్థ కార్యాలయంలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు, వరద ప్రభావిత గ్రామాల బాధితులకు నిత్యావసర సరుకులు, వస్త్రాలను పంపిణీ చేశారు. ఈరే మినిస్ట్రీస్ సంస్థ అధినేత బిషప్ కత్తెర సుధీర్ కుమార్ జన్మదినం సందర్భంగా ఈ సేవాకార్యక్రమాన్ని నిర్వహించారు. సంతోష్‌కుమారి, పి.గిద్యాన్, ఈశ్వర్, కృపాదానం, రాజు, నాని, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బుర్రిపాలెం రోడ్డులో ఆక్రమణల తొలగింపు



తెనాలిఅర్బన్: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బుర్రిపాలెం రోడ్డులో ఉన్న ఆక్రమణలను సోమవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. జేసీబీతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఇతర వస్తువులను పోలీసుల సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ శివన్నారాయణ మాట్లాడుతూ పట్టణంలో పలుచోట్ల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. దీని లో భాగంగా ఆక్రమణలను తొలగిస్తున్న ట్లు చెప్పారు. కార్యక్రమంలో టీపీవో సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆరోగ్యమే మహా బలం



భట్టిప్రోలు: ఆరోగ్యమే మహా బలం అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని బీఎఫ్ఏ స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్, కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డెప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ నిర్మల గ్లోరి తెలిపారు.బీఎఫ్ఏ ఆధ్వర్యంలో సోమవారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో ఆరోగ్యకరమైన అలవాట్లపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిర్మల గ్లోరి మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవికను అలవరచుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం చందలూరి రామకోటేశ్వరరావు, బీఎఫ్ఏ కో–ఆర్డినేటర్ మాచర్ల వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ పి. మల్లికార్జునరావు పాల్గొన్నారు.

చీకట్లో ఆంధ్రాప్యారిస్ వీధులు!

- కొన్ని వీధుల్లో వెలగని వీధి దీపాలు
- పట్టించుకోని యంత్రాంగం
- రాత్రి వేళల్లో పట్టణవాసులకు తప్పని తిప్పలు



కొత్తపేటలో వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో ఉన్న వీధి



చీకటిగా ఉన్న షరాఫ్ బజార్‌లోని ఓ వీధి

తెనాలిఅర్బన్: పట్టణం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు కొన్ని వీధులలో మినహా మిగిలిన ఎక్కువ వీధుల్లో చీకట్లు రాజ్యమేలుతున్నాయి. ఇవి వెలగటం లేదు. దీంతో దొంగతనాలతో పాటు అరాచక శక్తులు అగడాలు పెరుతున్నాయి. 16.77 కిలో మీటర్ల విస్తీర్ణంలో పట్టణం ఉంటుంది. దీనిలో 40 వార్డులు ఉన్నాయి. పట్టణంలోని 55,917 నివాస గృహాలలో 1.65 లక్షల జనాభా నివశిస్తుంటారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉంది. తెనాలి పట్టణంలోని పలు వీధులలో అధికారులు 10,040 వీధి దీపాలను గతంలో ఏర్పాటు చేశారు. వాటిలో ఎల్ఈడీ (20 వాట్స్) లైట్లు 8973, హైమాస్ట్ లైట్స్ (90 వాట్స్) 90, (120,210 వాట్స్) లైట్లు 977 ఏర్పాటు చేశారు. వీటికి టైమర్స్‌ను ఏర్పాటు చేయటంతో అవి సమయానికి వెలగటం, ఆరిపోవటం జరుగుతుంటాయి.

ఎక్కువ శాతం వెలగని వీధి దీపాలు

పట్టణంలోని వీధి దీపాలను పర్యవేక్షించేందుకు 8 మంది ఉద్యోగులు పనిచేస్తుంటారు. వీరి పర్యవేక్షణను ఏఈలు, డీఈలు చూస్తుంటారు. వీటి నిర్వహణ కోసం ఏడాదికి రూ.10 లక్షల వరకు వెచ్చిస్తుంటారు. కానీ తెనాలి పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడలిలోని వీధి దీపాలు ఎప్పుడు వెలుగుతాయో దేవుడికె ఎరుక అన్న చందాన ఉంటుంది. అనుకోకుండా ఏదైనా వీధి దీపం పాడైతే దానిపై ఫిర్యాదు చేసినా బాగు చేయించేవారు ఉండరు. కౌన్సిలర్‌లు ఎవరైన దీనిపై నిలదీస్తే లైట్లు లేవని టెండర్లు పిలిచామని చెబుతూ దాటవేస్తుంటారు. ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అయితానగర్‌లో గంటలో పర్యటించనున్నట్లు ఆయన కార్యాలయం నుంచి సమాచారం మున్సిపల్ అధికారులకు అందింది. సమయం సాయంత్రం ఆరు కావటంతో ఆయన పర్యటించనున్న ప్రాంతంలో వీధిదీపాలు పాడైన విషయం అధికారులకు తెలిసింది. అధికారులు హడావిడిగా కొన్ని వీధిదీపాలు ఆ సమయంలో ఏర్పాటు చేయించారు. దీనిని బట్టి అధికారులు పనితనం ఏ విధంగా ఉందో మనకు అర్థమౌతుంది.
ప్రధాన రహదారుపై ఉన్న శ్రద్ధ వీధులపై లేదు. తెనాలి పట్టణంలోని నాలుగులైన్ల రహదారి, గాంధీచౌక్, మెయిన్ రోడ్డు, బుర్రిపాలెం రోడ్డు, చినరావూరు, అయితానగర్‌కు వెళ్లే ప్రధాన రహదారుల్లోని వీధి దీపాలపై అధికారులు ఎక్కువగా దృష్టి పెడుతున్నారనే విమర్శ ఉంది. మిగిలిన వీధులలో లైట్లు పాడైతే వాటిని నెలలు దాటుతున్నా బాగు చేయించిన దాఖలాలు ఉండటం లేదు. అదే శివారు ప్రాంతాలు, ఇతర వీధులలో అయితే నెలలు దాటుతున్న వెలగని దీపాలు కన్పిస్తునే ఉంటాయి. ఇటీవల కాలంలో అధికారులు విద్యుత్‌ను ఆదా చేయాలనే ఉద్దేశంతో 20 వాట్స్ లైట్స్‌ను ఎక్కువగా ఏర్పాటు చేశారు. వాటి నుంచి కాంతి సరిగా రావటం లేదు. లైటు ఉన్న ప్రాంతంలో మినహా మిగిలిన చోట చీకటిగా కన్పిస్తుంది.

కౌన్సిలర్లలో అసహనం

పట్టణంలోని అనేక వీధులలో వీధి దీపాలు వెలగక పోవటంపై ప్రతినెలా జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్‌లు ఫిర్యాదులు చేయటం పరిపాటిగా మారింది. ఆ సమయంలో అధికారులు వాటిని బాగు చేయిస్తామని చెప్పటం మినహా ఆచరణలో అది కన్పించదు. ఇది ఇలా ఉంటే నేటికి శివారు ప్రాంతాల్లోని కొన్ని వీధులలో నేటికీ వీధి దీపాలు లేని పరిస్థితి ఉంది. వాటిని ఏర్పాటు చేయాలని కౌన్సిలర్‌లు కోరిన ఆ దిశగా అడుగులు పడటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వీధిదీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైన ఉంది.

చర్యలు తీసుకుంటున్నాం



పట్టణం వీధి దీపాల సమస్య గతంలో ఉండేది. నేడు ఆ పరిస్థితి లేదు. దాదాపు 90 శాతం వీధి దీపాలు వెలుగుతున్నట్లు సమాచారం ఉంది. ఇంకా ఎక్కడైనా సమస్య ఉంటే మా దృష్టికి తెస్తే వాటిని బాగు చేయిస్తాం. వీటి బాధ్యతలను కూడా ఒక డీఈ, ఏఈకి అప్పగించాం.

– ఆకుల శ్రీనివాసరావు,
ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజినీర్, తెనాలి.

కుళాయి కనెక్షన్ తొలగించండి

తెనాలిఅర్బన్: రక్షిత మంచినీటి పథక కుళాయి కనెక్షన్ ఉందని, దానిలో నీరు రావడం లేదని, దానిని తొలగించే విధంగా చూడాలని ఐతానగర్‌కు చెందిన దాసరి ప్రకాశరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతికి అర్జీ ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, స్థానిక నివాసులలు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మేకల పెంపకంతో ఇబ్బందులు



తెనాలిరూరల్: ఇళ్ల మధ్యలో మేకలను పెంచుతుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవడంతో పాటు అనారోగ్యం బారిన పడుతున్నామని మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన డాక్టర్ పూర్ణప్రజ్ఞాచారి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కోడూరు వెంకయ్య అలియాస్ జోసఫ్ తమ ఇళ్ల వద్ద మేకల పెంపకం చేపట్టాడని, దీనివల్ల తమ కుటుంబ సభ్యులందరూ అనారోగ్యం బారిన పడినట్టు తహసీల్దార్ దృష్టికి తీసుకు వచ్చారు. మేకలను ఇతర ప్రాంతంలో పెంచుకోవాలని అడిగితే తమపై దాడి చేస్తున్నాడని ఆరోపించారు. దీనిపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆయనకు తెలిపారు.

ఉత్సాహంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



తెనాలి గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు



పెదరావూరు గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు



సంగంజాగర్లమూడి గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు



కొలకలూరు గ్రంథాలయంలో సభ్యత్వ నమోదు

తెనాలి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థులపై ఇంటర్నెట్–డిజిటలైజేషన్ ప్రభావం' అంశంపై జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాయపాటి శివనాగేశ్వరరావు వ్యవహరించారు. విజేతలకు వారోత్సవాల ముగింపుసభలో బహుమతులను అందజేస్తామని గ్రంథాలయ అధికారిణి కావూరి రమాదేవి తెలియజేశారు.

పెదరావూరులో...
రూరల్ మండల గ్రామం పెదరావూరులోని శాఖాగ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం విద్యార్థిని, విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం పోటీలను నిర్వహించారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకట అప్పారావు ఈ పోటీలను జరిపారు. గ్రంథాలయ అధికారి రాఘవేంద్రరావు పర్యవేక్షించారు.

సంగం జాగర్లమూడిలో...
రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రంథాలయాధికారి జె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో చిత్రలేఖనం, దేశభక్తి గీతాలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథులు/న్యాయ నిర్ణేతలుగా ప్రధానోపాధ్యాయుడు షేక్ కాలేషా, ఉపాధ్యాయులు పి. నాగలక్ష్మి, సరోజిని వ్యవహరించారు.

కొలకలూరులో...
కొలకలూరులోని శాఖాగ్రంథాలయంలో జాతీయ గ్రంథాల వారోత్సవాల్లో భాగంగా అయిదోరోజైన సోమవారం గ్రంథాలయ నూతన సభ్యత్వ నమోదును నిర్వహించారు. క్విజ్ పోటీలను జరిపారు. స్కూల్ అసిస్టెంట్ సీహెచ్ పూర్ణచంద్రరావు క్విజ్ మాస్టారుగా వ్యవహరించారు. మరో స్కూల్ అసిస్టెంట్ కె.ఆదినారాయణరావు 20 మంది విద్యార్థులకు సభ్యత్వాన్ని ఇచ్చారు. గ్రంథాలయ అధికారిణి కడియాల సుజాత పర్యవేక్షించారు.

నందివెలుగులో...
రూరల్ మండల గ్రామం నందివెలుగులోని శాఖాగ్రంథాలయం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. సోమవారం జిల్లాపరిషత్ హైస్కూలు, విక్టోరియా స్కూల్ విద్యార్థులకు 'అవర్ నేచర్' అంశంపై చిత్రలేఖన పోటీలు జరిపారు. చిత్రలేఖన ఉపాధ్యాయులు ఎం.శివశంకరరావు, ఎం.శివశంకరరావు, భార్గవరామ్ ఈ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి బొల్లు మాధవి తదితరులు పర్యవేక్షించారు.

మున్సిపల్ స్థలాన్ని ఖాళీ చేయండి

చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: మహాత్మా గాంధీ కూరగాయాల మార్కెట్ కాంప్లెక్స్‌ను అక్రమించుకుని కొందరూ వ్యాపారులు చేస్తున్నారని, వెంటనే వారు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న సూచించారు. మున్సిపల్ మార్కెట్ వద్ద సోమవారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది వ్యాపారులు అనధికారకంగా అక్కడ వ్యాపారం చేసుకోంటున్నారని తెలిపారు. షాపులు దక్కించుకున్న మరికొందరూ వ్యాపారులు మున్సిపల్ స్థలంలో వ్యాపారాలు చేసుకుంటున్నారని చెప్పారు. తమకు కేటాయించిన షాపుల్లో వ్యాపారాలు చేసుకోవాలని, ముందుకు జరిగితే సహించేది లేదన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయం శిధిలావస్థకు వచ్చిందని, త్వరలో మార్కెట్‌పై అంతస్థుకు దానిని మార్చనున్నట్లు చెప్పారు. పై అంతస్థుకు వెళ్ళే మెట్లను రాకపోకలకు అనువుగా ఉంచాలని సూచించారు. సమావేశంలో ఆర్‌వో రాంప్రసాద్, ఏసీపీ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మురుగును వెంటనే తొలగించండి
తెనాలిఅర్బన్: మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయకపోవడం వలన ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోవాలంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 13,14 వార్డులలో సోమవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి ఆమె సూచనలు చేశారు. అలాగే పిచ్చిమొక్కలు మొలవడాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. కాల్వలను బాగు చేసి ఎన్నిరోజులు అయిదంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుర్రా సుజాత, దాసరి వీరవసంతరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఎఈ సూరిబాబు, పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఎండీయూ ఆపరేటర్లను హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పట్టణ, మండల పరిధిలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ పాల్గొని రేషన్ పంపిణీపై డీలర్లకు, యండీయూలకు పలు సూచనలు చేశారు. రేషన్ పంపిణీలో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీలోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా చూడాలని ఎవరికీ ఇబ్బంది లేకుండా సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. చిన్న చిన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ)ల నిర్వాహకులు తమకు అందించిన సరుకులను ఖచ్చితంగా పంపిణీ చేపట్టాలని, తప్పనిసరి పరిస్థితుల్లో ఎండీయూలు అందుబాటులో లేకపోతే డీలర్లు, వీఆర్వోలతో సమన్వయం చేసుకుని రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. ఇటీవల ఓ ఆపరేటర్ పోలీసులకు రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడ్డాడని, అటువంటి ఘటనలు చోటుచేసుకుంటే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. తాను స్వయంగా రేషన్ పంపిణీని పరిశీలిస్తానని చెప్పారు. పట్టణ, మండల పరిధిలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, సీఎస్‌డీటీ మూర్తి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలి

కర్లపాలెం: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె.బి.శ్రీధర్ కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కర్లపాలెం ఇస్లాంపేటకు చెందిన మహిళలు గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీతకు స్థలాల కోసం వినతి పత్రం అందజేశారు. శ్రీధర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలు లేని వారికి ప్రభుత్వం మూడు సెంట్లతో పాటు రూ.5లక్షల నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ రత్నకుమారి, సీపీఐ మండల కార్యదర్శి షబ్బీర్ అలీ, మహిళలు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి



సబ్‌కలెక్టర్ సంజనా సింహకు వినతిపత్రం అందజేస్తున్న శివసాంబిరెడ్డి

తెనాలి: కేంద్రప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ ప్రకారం వినతిపత్రాన్ని సోమవారం సబ్‌కలెక్టర్ వి.సంజనారెడ్డికి అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.
గతేడాది ఎకరానికి ధాన్యం దిగుబడి 40 బస్తాలు కాగా, ఈసంవత్సరం 30 బస్తాలకు పడిపోయిందన్నారు. గతేడాది 75 కిలోల బస్తా ధర రూ.1800 ఉంటే, ప్రస్తుతం రూ.1400–1470లకు మించి కొనుగోలు చేయడటం లేదన్నారు. దీంతో రైతులు, కౌలురైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. పంట దిగుబడి ఆరంభంలోనే ఇలా ఉంటే, ముమ్మరంగా హార్వెస్ట్ జరిగితే ధర ఏవిధంగా ఉంటుందోనని అన్నారు. మరోవైపు మార్కెట్లో... 26 కిలోల బియ్యం రూ.1600–1700లకు అమ్మకాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాలు ధాన్యం ధర రూ.2320, 75 కిలోల బస్తా రూ.1740లకు కొనుగోలు జరుగుతున్నందున రైతులు ఎకరాకు రూ.8 వేలు నష్టపోతున్నారని శివ సాంబిరెడ్డి విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయిస్, రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శివాలయాల్లో శివనామస్మరణ

- కార్తికమాసం మూడో సోమవారం
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- కార్తికదీపాలు వెలిగించి పూజలు, అభిషేకాలు చేసిన భక్తులు



చారిత్రక శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో స్వామి



మారీసుపేట శివాలయంలో కార్తిక దీపారాధనలు



సుల్తానాబాద్ ఆలయంలో స్వామికి అభిషేకం



నందివెలుగులోని శ్రీఅగస్తేశ్వర స్వామి ఆలయంలో స్వామి



పినపాడు ఆలయంలో క్యూలైనులో భక్తులు

తెనాలి: హిందూ సాంప్రదాయంలో మహిమాన్వితమైన కార్తికమాసం సంప్రదాయాలను భక్తులు ఆచరిస్తున్నారు. కార్తిక మాసం పరమ శివునికి అత్యంత ప్రీతి పాత్రమని తెలిసిందే. ఈ మాసంలో సోమవారం మరింత ప్రత్యేకమైనదిగా భక్తులు ఆచరిస్తారు. కార్తిక మాసం మూడో సోమవారం కూడా తెల్లవారుజాము నుండే పట్టణ, పరిసరాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు మొదలయ్యాయి. పట్టణ గంగానమ్మపేటపేటలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీపర్వతవర్ధనీ సమేత శ్రీరామేశ్వర స్వామి దేవాలయం, మారీసుపేట, సుల్తానాబాద్, రామలింగేశ్వరపేట, పినపాడు సహా పలు శివాలయాలు, రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలోని సంగమేశ్వర దేవాలయం, నందివెలుగులోని శ్రీ అగస్తేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పెద్దసంఖ్యలో మహిళలు తెలతెలవారుతూనే ఆలయాలకు చేరుకున్నారు. కార్తిక దీపాలు వెలిగించారు. వివిధ ఆలయాల్లో పరమేశ్వరునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు ఎంతో వైభవంగా జరిగాయి. గంగానమ్మపేటలోని శ్రీ రామేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. శ్రీరామేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని తోటలో కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈవో వీవీ రమణకుమారి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మారీసుపేటలోని శ్రీబాల త్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రమౌళేశ్వరస్వామి దేవస్థానంలో విశేష అభిషేకాలు పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాల నుండి భక్తులు తరలి వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. సుల్తానాబాద్‌లోని శివాలయంలో కార్తిక మాసం మూడో సోమవారం పురస్కరించుకుని స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. తెనాలి మండల గ్రామం సంగంజాగర్లమూడిలోని శ్రీబాలత్రిపురసుందరీసమేత సంగమేశ్వర స్వామి, నందివెలుగులోని శ్రీఅగస్తేశ్వరస్వామి దేవాలయాల్లోనూ కార్తికమాసం మూడో సోమవారం విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.